

సాగునీటి సంఘాలు లేకపోవడంతో మరమ్మతులు లేక అధ్వానంగా మారిన ఓ కాల్వ

సాగునీటి సంఘాలపై కసరత్తు

పుష్కలంగా నీరందితేనే పంటలు పచ్చగా కళకళలాడి మంచి దిగుబడిని ఇస్తాయి. అయితే అలా జరగాలంటే సాగునీటి కాల్వలు బాగుండాలి. ఇందుకోసం గత ప్రభుత్వాలు ప్రత్యేకంగా కాల్వల పరిధిలోని ఆయకట్టు రైతులతో కమిటీలు వేసి కాల్వల మరమ్మతులు, నీటి నిర్వహణ తదితరాలను వారి ఆధ్వర్యంలోనే జరిగేలా చేసేవి. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని రంగాల మాదిరిగానే సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసింది. పైగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు లేకుండా చేయడంతో పాటు ఆ నిధులను దారిమళ్లించేసింది. దీంతో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారి నీటి పారుదల సక్రమంగా సాగక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి సారించి.. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేపట్టింది. సాగునీటి కాల్వల పరిధిలో ఆయకట్ట వారీగా సర్వే నెంబర్లు ఆధారంగా రైతులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. ఓటర్ల గుర్తింపు అనంతరం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

- ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి
- సాగర్ కుడికాల్వ పరిధిలో 259 నీటి సంఘాలు
- రైతుల గుర్తింపునకు సర్వే నెంబర్లు సేకరణలో అధికారులు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం నిర్వీర్యం.. నిధుల మళ్లింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పూడిక, తూటికాడతో నిండిపోయిన సాగునీటి కాల్వలు.. వాటి మరమ్మతులపై ఆలోచన చేయని పాలకులు.. సాగునీరు సక్రమంగా అందక నష్టపోయిన రైతులు.. నిధుల లేమితో కాల్వల మరమ్మతులను పట్టించుకోని అధికారులు.. ఇదీ ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం దుస్థితి. ఈ క్రమంలో సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగునీటి పారుదల వ్యవస్థ పర్యవేక్షణలో కీలకమైన సాగునీటి ఎన్నికల నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ సమాయత్తమవుతోంది. రానున్న రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల నిర్వహణపై జలవనరులశాఖ అధికారులతో ఇటీవల సమీక్షించారు. రెవెన్యూ శాఖను కూడా ఎన్నికల నిర్వహణలో భాగస్వామని చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే నీటి సరఫరా.. కాల్వల మరమ్మతుల్లో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీ కాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవ డం తో జలవనరుల నిర్వహణ గాడి తప్పింది. కాల్వలు పూడికతో నిండి అధ్వానంగా తయార య్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో నాగార్జునసాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీలో 259 నీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటికి ఎన్నికల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో సాగునీటి కాల్వల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఎన్నికలకు ఆదేశించింది.

నీటి తీరువా వసూలు.. దారిమళ్లింపు

సాగర్ కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదు శాతం కేటాయిస్తారు. 80 శాతం నిధులను మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగునీటి కమిటీల వారీగా కేటాయిస్తుంది. వైసీపీ హయాంలో ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరగలేదు. నీటి తీరువా నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ప్రతి ఏటా రూ.20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. ఈ నిధులను కాడాకు చేరకుండా వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. సాగునీటి సంఘాల ఎన్నికలు జరగకపోవడంతో అధికారులకు ప్రభుత్వం నీటి సంఘాల బాధ్యతలను అప్పగించింది. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్సీకి, డిస్ట్రిబూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటిసంఘాల బాధ్యతలను డీఈ, జేఈలకు కేటాయించింది. నీటి సంఘాలు లేకపోవడంతో కాల్వ పనుల పర్యవేక్షణను కూడా ఆయా అధికారులకే అప్పగించారు. ఐదేళ్లుగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాల్వల మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. ఈ పరిస్థితుల్లో సాగు నీటి సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పల్లెల్లో ఎన్నికల సందడి..

తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. వైసీపీ ఐదేళ్ల సాగునీటి ఎన్నికలను విస్మరించగా కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొనున్నది. ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతుల్ని ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగునీటి సంఘాల వారీగా ఓటర్లను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుంది. రెవెన్యూ జలవనరుల శాఖలు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తాయి. ప్రభుత్వ ఉత్తర్వు మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు సదరు అధికారులు తెలిపారు. ఈ సంఘాలు నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యుయూఏ)కు కమిటీలను టీసీ సభ్యులు ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. డీసీల నుంచి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.



నరసరావుపేటలోని ప్రాజెక్టు కమిటీ, డీసీ కార్యాలయాలు

అన్నపూర్ణా.. నమోస్తుతే..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవార్లు అన్నపూర్ణాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులతో ఆయా ఆలయాల్లో సందడి నెలకొంది. అమ్మవార్ల దర్శనం అనంతరం తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

- గుంటూరు



గుంటూరు విద్యానగర్ 3వ లైన్‌లోని శ్రీ సాయినాథ సన్నిధానంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



గుంటూరు మారుతీనగర్‌లో శ్రీ కంచి కామకోటి పీఠ మారుతి దేవాలయంలో శ్రీ కాళికాదేవిగా అమ్మవారు




గుంటూరు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పుష్పశయ్య అలంకరణలో అమ్మవారు



తెనాలి మారీస్‌పేట: శ్రీ విద్యాపీఠంలో డ్రైఫ్రూట్స్ అలంకరణలో శ్రీలలిత త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

వారణాసి రైలుకు.. ఆటంకాలు



వారణాసి



- పట్టాలెక్కకుండా ఇతర జోన్ల మోకాలడ్డు
- ఐఆర్‌టీటీసీలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన
- కేంద్ర మంత్రి, ఎంపీలు చొరవ చూపిస్తే మంజూరయ్యే అవకాశం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లుగానో గుంటూరు మీదగా శివభక్తుల సౌకర్యార్థం వారణాసికి రైలు నడపాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షకి ప్రతిబంధకాలు తలెత్తాయి. తిరుపతి - వారణాసి వయా న్యూ గుంటూరు నూతన రైలుని దక్షిణ మధ్య రైల్వే ఇటీవల జరిగిన ఐఆర్‌టీటీసీ-2024 సమావేశంలో ప్రతిపాదించింది. అయితే ఈ రైలు ప్రయాణించాల్సిన మార్గంలోని ఇతర రైల్వే జోన్లు తమకు ఆటంకాలు ఏర్పడతాయని చెప్పి మోకాలడ్డాయి. లేకుంటే ఈ పాటికి ఎంతోమందికి ఉపయోగపడే ఈ రైలు పట్టాలెక్కి ఉండేదే. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు ఉన్న నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు చొరవ తీసుకుని ప్రయత్నిస్తే కచ్చితంగా ఈ రైలుకు అడ్డంకులు తొలగించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా వారణాసి(కాశీ), తిరుపతి వెలుగొందుతున్నాయి. నిత్యం ఈ రెండు పుణ్యక్షేత్రాలకు వేలల్లో భక్తులు సందర్శిస్తుంటారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు పుణ్యక్షేత్రాలను కలిపే ఒక్క రైలు కూడా అందుబాటులో లేదు. ఎవరైనా కాశీ సందర్శనకు వెళ్లాలంటే వారంలో రెండు రోజులు విజయవాడ మీదగా ప్రయాణించే గంగా కావేరి, ఒక రోజు ప్రయాణం చేసే పట్నా, కాశీ - తమిళ సంఘం, రామేశ్వరం - బనారస్ రైళ్ల కోసం వేచి చూడాల్సిందే. వాటిల్లో విజయవాడ కోటా చాలా తక్కువగా ఉంటున్నందున 120 రోజుల ముందుగానే టిక్కెట్లు బుకింగ్ అయిపోతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుని తిరుపతి - వారణాసి రైలుని ప్రవేశపెడితే అటు శివుడు, ఇటు వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఐఆర్‌టీటీసీ దక్షిణ మధ్య రైల్వే జోన్ మీటింగ్‌కు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి ఈ రైలు తెనాలి - న్యూగుంటూరు - మంగళగిరి(అమరావతి రాజధాని ప్రాంతం) - విజయవాడ మీదగా సమయపట్టిక కూడా రూపొందించారు. అయితే ఈ రైలుకు ప్రతిపాదించిన సమయంలో తమకు వేరే రైళ్లు ఉన్నాయని చెప్పి అంగీకారం తెలపలేదు. దీంతో ఈ ప్రతిపాదన మరుగున పడిపోయింది. గతంలో కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఉండగా, ఇక్కడ వైసీపీ ప్రభుత్వం ఉన్నది. దీని వల్ల ఎలాంటి ఉపయోగం రైళ్లపరంగా జరగలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి గెలిచిన టీడీపీ, జనసేన ఎంపీలపై ఆధారపడి ఎన్‌డీఏ-3 కూటమి ప్రభుత్వం దేశాన్ని పరిపాలిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ రైల్వే డిమాండ్లు సాధించుకోలేమనేది వాస్తవం. ఈ దృష్ట్యా ఢిల్లీకి వెళ్లినప్పుడు ఎంపీలంతా సమష్టిగా రైల్వే మంత్రి, రైల్వే బోర్డు ఛైర్మన్‌తో భేటీ అయి తిరుపతి - వారణాసి రైలు ఆవశ్యకతని వివరిస్తే సాధ్యమైనంత త్వరలోనే ఈ రైలు మంజూరయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.



తిరుపతి

ఇచ్చిన హామీలన్నీ మూడేళ్లలో అమలు

- గుంటూరు చానల్, నల్లమడ ఆధునికీకరిస్తాం
- కాకుమానులో కేంద్ర సహాయశాఖ మంత్రి పెమ్మసాని


కాకుమాను, అక్టోబరు 6: వచ్చే మూడేళ్లలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. గుంటూరు చానల్, నల్లమడ ఆధునికీకరణ చేస్తామన్నారు. వీటికి 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.250 కోట్లు మంజూరు చేయగా వైసీపీ ప్రభుత్వం రీటెండరింగ్ పేరుతో పనులు నిలిపేసిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంట్ తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ అధికారులు వైసీపీ వాసనను వీడాలని, అలసత్వంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎకనామిక్ జోన్, రైతు సేవ, పరిశోధనా కేంద్రాలు కాకుమానుకు వస్తున్నాయని చెప్పారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పంచాయతీలను నిర్వీర్యం చేసి రాష్ట్రంలో మనుగడ కోల్పోయిందన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్‌చౌదరి, సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్యచౌదరిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు బీమినేని వందనాదేవి, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, అగస్టీన్, పూర్ణచంద్రరరావు, పెంట్యాల శ్రీధర్, రాంగోపాల్, నూతి, శరత్‌బాబు బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు యడ్లపాటి శ్రీధర్, గడ్డం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రాణాలు తీస్తున్న మురుగు నీరు

- భయపెడుతున్న బ్యాక్టీరియా.. విస్తరిస్తోన్న నెక్రోటైజింగ్ ఫాసిటిస్ వ్యాధి



గుంటూరు(మెడికల్), అక్టోబరు 6: మురుగు నీటిలో ఉండే బ్యాక్టీరియా వల్ల నెక్రోటైజింగ్ ఫాసిటిస్ అనే వ్యాధి విస్తరిస్తోంది. ఈ వ్యాధిని ఫ్లష్ ఈటింగ్ డిజీస్‌గా కూడా పిలుస్తారు. ఈ వ్యాధి బారిన పడి గుంటూరులో సోడా బండి నడుపుకునే నారాయణ అనే వృద్ధుడు ఇటీవల ప్రాణాలు కోల్పోయాడు. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో అతడి ఇంట్లో చేరిన నీటిలో డ్రెయినేజీ నీరు కలిసింది. ఈ నీటిలోనే ఉన్న అతడికి నాలుగు రోజుల తర్వాత కాలు దురద అనిపించడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద మందులు వాడాడు. సెప్టెంబరు 20న కాలుపై పుండు ఏర్పడింది. కుటుంబసభ్యులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా వైద్యులు ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించి కాలు తీసేయాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు అతడ్ని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ కాలులో కొంత కండతీసి చికిత్స చేస్తామని, తగ్గుతుందేమో చూద్దామని చెప్పి ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే నారాయణ మృతి చెందాడు. దీనిపై ఇన్‌ఫెక్షన్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ రేవూరి హరికృష్ణ మాట్లాడుతూ నెక్రోటైజింగ్ ఫాసిటిస్ అత్యంత వేగంగా విస్తరించే ఇన్‌ఫెక్షన్‌గా తెలిపారు. రోగులను తొలి దశలో గుర్తించి వెంటనే చికిత్సలు చేయించాలని సూచించారు. రోగులకు మధుమేహం తదితర వ్యాధులు ఉంటే దానిని పూర్తిగా కంట్రోల్ చేస్తేనే ఈ ఇన్‌ఫెక్షన్ ఉధృతిని నియంత్రించవచ్చని తెలిపారు.

మద్యంపై 20 శాతం లాభం

- దరఖాస్తులకు మూడు రోజులే గడువు
- ఎక్సైజ్ గుంటూరు డీసీ డాక్టర్ కే.శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 6: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా అమ్మకాలపై వ్యాపారులకు 20 శాతం లాభాలు వస్తాయని గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక రాష్ట్రాల్లోని మద్యం పాలసీలను పరిశీలన చేసిన తర్వాత వాటి కంటే ఉత్తమంగా రాష్ట్ర ప్రభుత్వం పాలసీని తీసుకువచ్చిందన్నారు. మరో మూడు రోజులు మాత్రమే దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు. దీంతో ప్రత్యేకంగా గుంటూరు డీసీ, ఈఎస్ ఆఫీసులో కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 507 దరఖాస్తులు వచ్చాయన్నారు. సమావేశంలో ఏసీ రవికుమార్‌రెడ్డి, ఈఎస్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే.శ్రీనివాసులు, పక్కన ఏసీ రవికుమార్‌రెడ్డి, ఈఎస్ అరుణకుమారి

ఘర్షణలో వ్యక్తి మృతి



మృతుడు భూషయ్య (ఫైల్‌ఫొటో)

రేపల్లె, అక్టోబరు 6: దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి బొమ్మ వద్ద ఏర్పడిన వివాదం కారణంగా చోటు చేసుకున్న ఘర్షణలో నున్నా భూషయ్య(47)మృతి చెందాడని రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. దుర్గాదేవి బొమ్మ ఏర్పాటు విషయమై నగరం మండలం దాసరిపాలెంకు చెందిన నున్నా భూషయ్య, అదే గ్రామానికి చెందిన నున్నా బాలశంకర్, మణికంఠల మధ్య శనివారం రాత్రి వివాదం జరిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి రెవెన్యూ గ్రామంలో వీరి మధ్య ఘర్షణ జరిగింది. పక్కనే ఉన్న సెంట్రింగ్ కర్రలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన భూషయ్యను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ భూషయ్య మృతి చెందగా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుని కుమారుడు అజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేశారు. దర్యాప్తు రూరల్ సీఐ సురేష్‌బాబు చేస్తున్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ కావటంతో కక్ష పెంచుకుని టీడీపీ వర్గీయులు దాడి చేసి చంపారని నున్నా భూషయ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, అలాంటిదేమీ లేదని దసరా మహోత్సవంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి బొమ్మ వద్ద ఏర్పడిన వివాదమే కారణమని పోలీసులు చెబుతున్నారు.

కృష్ణానదిలో యువకుడు గల్లంతు



గల్లంతైన నరేష్ (ఫైల్ ఫొటో)

కొల్లూరు, అక్టోబరు 6 : కృష్ణానదిలో యువకుడు గల్లంతు అయిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి బీసీ కాలనీకి చెందిన ఏడుగురు యువకులు చిలుమూరు వద్ద కృష్ణానదిలో ఈత వేసేందుకు వచ్చారు. పార్టీ చేసుకున్న అనంతరం నదిలోకి దిగి వాలీబాల్ ఆడుతున్నారు. గమనించిన పశువుల కాపరులు లోపలికి వెళ్లవద్దంటూ యువకులను హెచ్చరించారు. అయిన పట్టించుకోకుండా నదిలో ఆడుతుండగా బొడ్డపాటి నరేష్ (20) అనే యువకుడు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. గమనించిన అతనితోపాటు ఉన్న యువకులు అతనిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు, యువకుని కుటుంబ సభ్యులకు తోటి యువకులు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ హుటాహుటిన చిలుమూరు కృష్ణానది వద్దకు వెళ్లి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన యువకుని తండ్రి శ్రీనివాస్ నుంచి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ఆందోళన



చంద్రమౌళినగర్‌లో పత్తి వ్యాపారి నివాసం ఉండే అపార్ట్‌మెంట్ ఎదుట బాధిత రైతుల ధర్నా

- రెండేళ్లుగా డబ్బు చెల్లించకుండా కాలయాపన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

గుంటూరు, అక్టోబరు 6: ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటను కొనుగోలు చేసిన వ్యాపారి రైతులకు డబ్బు చెల్లించకుండా ముప్పతిప్పలు పెడుతున్నాడు. రెండేళ్లుగా రైతులు అటు వ్యాపారి ఇంటికి, ఇటు పోలీస్ స్టేషన్ ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి విసుగు చెంది గత్యంతరం లేక ఆదివారం గుంటూరులో సదరు వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య శరణ్యం అంటూ బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు హామీ మేరకు రైతులు ధర్నా విరమించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన నేరెళ్ల హరిప్రసాద్ అనే పత్తి వ్యాపారి కుర్నూతల వద్ద జిన్నింగ్ మిల్ నిర్వహిస్తుంటాడు. హరి ప్రసాద్ తనకు అవసరమైన పత్తిని శెట్టి సుబ్బారావు, ఫిరంగిపురంకు చెందిన మున్నంగి జోజప్ప అనే బ్రోకర్ల ద్వారా తమ వద్ద కొనుగోలు చేశాడని రైతులు వాపోయారు. కొద్ది సంవత్సరాలుగా కొనుగోలు చేసిన పత్తికి డబ్బులు చెల్లిస్తూ వచ్చాడన్నారు. ఈ క్రమంలో 2022న చివరిలో కొనుగోలు చేసిన పత్తికి డబ్బులు ఇవ్వలేదని రైతులు పేర్కొన్నారు. బేజాత్పురం, పొన్నెకల్లు, జొన్నలగడ్డ, కొప్పురావూరు, పరస, తాళ్లచెరువు తదితర గ్రామాల్లో సుమారు 100 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తికి రూ.కోటి 90 లక్షల వరకు వ్యాపారి నేరెళ్ల హరిప్రసాద్ డబ్బు చెల్లించాల్సి ఉందన్నారు. తమ వద్ద కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసి దానిపై బ్యాంకుల నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు రుణం తీసుకున్నాడన్నారు. అప్పటి నుంచి హరి ప్రసాద్ చుట్టూ తిరుగుతూనే ఉన్నామన్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. చివరకు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని బాధిత రైతులు సుధాకర్ రెడ్డి, రమేష్ పేర్కొన్నారు. బాధితుల్లో అత్యధిక మంది రైతులు ఉండగా కొందరు బ్రోకర్లు కూడా ఉన్నారు. దీంతో బ్రోకర్లపై సంబంధిత రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పకుండా కనీసం ఫోన్ కూడా తీయడం లేదని, ఇంటికి వెళ్తే ఇంటిలో ఉండి కూడా లేదని చెప్పిస్తున్నాడన్నారు. దీంతో రైతులు ఆదివారం చంద్రమౌళి నగర్ 5/2 లో హరి ప్రసాద్ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. ఆందోళన విరమించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత రైతులు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని వీరేంద్రబాబు బాధిత రైతులకు హామీ ఇచ్చారు.

న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఉంటాం...

అప్పులు చేసి పత్తి సాగు చేశామని కొందరు రైతులు బోరుమన్నారు. మధ్యవర్తిగా ఉండి పత్తి ఇప్పించామని మరికొందరు రైతులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో తమకు డబ్బులు ఇస్తేనే గుంటూరు నుంచి కదులుతామని, లేదంటే ఇక్కడే ఉంటామని రైతులు చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయకుంటే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రాజకీయ నాయకులు హరిప్రసాద్‌కు అండగా ఉంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పట్టాభిపురం సీఐ వీరేంద్రకు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

యూటీఎఫ్ పోటీల్లో విజేత ఏలూరు



బహుమతులు అందుకున్న విజేతలతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రసాద్

గుంటూరు(విద్య), అక్టోబరు 6: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ నెల 4 నుంచి గుంటూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడలు ఆదివారం ముగిశాయి. అరండల్‌పేటలోని పిచ్చుకలగుంటలో నిర్వహించిన వేడుకల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ క్రికెట్‌లో 24 జిల్లాల నుంచి టీమ్స్ వచ్చాయని, ఫైనల్ కొచ్చిన శ్రీకాకుళం, ఏలూరు జిల్లాలు పోటాపోటీగా నిలిచాయన్నారు. ఏలూరు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించి ఫైనల్‌లో విజేతగా నిలిచిందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అద్భుతంగా నిజమైన క్రీడాకారుల్లా తలపడ్డారని అన్నారు. గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా యూటీఎఫ్ విజయంలో క్రియాశీలక పాత్ర పోషించినటువంటి అందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ నాయకులు పరమహంస, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఏఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీలక్ష్మి, రాజా, రమణ, కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నంబూరులో 4 కేజీల గంజాయి పట్టివేత

- ఏడుగురు నిందితుల అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

పెదకాకాని, అక్టోబర్ 6: మండల పరిధిలోని నంబూరు గ్రామ శివారులో గంజాయి కలిగి ఉన్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీన చేసుకున్నట్లు పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామి ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన అనగాని రాఘవేంద్ర ప్రసాద్, నూజివీడు టౌన్‌కు చెందిన తాతా హేమంత్ కుమార్, గుడ్లవల్లేరుకు చెందిన పండాలనేని వెంకట శివ గణేష్ కుమార్, విజయవాడ పడమట ప్రాంతానికి చెందిన ప్రతివాడ శివాజీ కలిసి తిరుగుతూ ఉంటారు. గంజాయికి బానిసైన వీరు అక్రమంగా డబ్బు సంపాదించాలని భావించారు. అధికంగా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో గంజాయి అమ్మకాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన మరో ముగ్గురు యువకులైన వాన రాజేష్, తాడిబోయిన గోపికృష్ణ అలియాస్ గోపి, దుర్గపు పవన్ కుమార్‌లకు గంజాయి తాగే అలవాటు ఉండటంతో పైనలుగురితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఈ నెల 5న 4 కేజీల గంజాయిని తీసుకువచ్చి నంబూరు గ్రామ శివారులోని యానాది కాలనీ సమీపంలో ఓ ఇంట్లో పొట్లాలు కడుతున్నారు. సమాచారం అందుకున్న పెదకాకాని తహసీల్దార్ పి.కృష్ణకాంత్, సీఐ టి.పి. నారాయణస్వామి, సిబ్బందితో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పొట్లాలు కడుతున్న 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎస్‌వీఎన్ కాలనీ చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, వెనుక నిందితుడు చినబాబు, పక్కన సీసీఎస్ పోలీసులు

గుంటూరు, అక్టోబరు 6: ఎస్‌వీఎన్ కాలనీ చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు తెలిపారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో నిందితుడు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొర్రెల చినబాబును మీడియా ముందు ప్రవేశ పెట్టి వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఎస్వీఎన్ కాలనీ ఏడో లైన్‌లో గత నెల 21న పట్టపగలు చోరీ జరిగిన విషయం విదితమే. ఈ కేసులో సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ ట్రాకింగ్, టవర్ డంప్ తదితర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, వెస్ట్ డీఎస్పీ బీఎం జయరాం ప్రసాద్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ ఎండీ అల్తాఫ్ హుస్సేన్, పట్టాభిపురం సీఐ, సీసీఎస్ పోలీసులతో కలిసి రంగంలోకి దిగారు. గొర్రెల చినబాబు, దువ్వాటి శామ్యూల్ రాజ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గోదావరి జిల్లాకు చెందిన శామ్యూల్ రాజు కొన్నేళ్లుగా నాగపూర్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఉంటే పోలీసులు అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో నాగపూర్‌లో ఉంటూ ఇక్కడకు వచ్చి దొంగతనాలు చేసి వెళ్తుంటాడు. శామ్యూల్ రాజుపై 20 పైగా కేసులు ఉన్నాయి. వీరు ఇద్దరూ కలిసి శంకర్రావు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అయితే గత నెల 28న శామ్యూల్ రాజును హైదరాబాదులోని పటాన్ చెరువు పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కాగా ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద పక్కా సమాచారంతో గొర్రెల చిన్నబాబును అరెస్టు చేశామని సీఐ తెలిపారు. నిందితుడు చిన్నబాబు వద్ద రూ21 లక్షల ఖరీదైన 306 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన ఆభరణాలు శామ్యూల్ రాజు వద్ద రికవరీ చేయాల్సి ఉందన్నారు. రాజమండ్రిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చినబాబు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. క్రమంగా క్రికెట్ బెట్టింగ్స్‌తోపాటు హార్స్ రైడింగ్, పేకాట వంటి దుర్వ్యసనాలకు అలవాటు పడ్డాడు. చిన్నబాబును అరెస్టు చేయడంలో ఆయన బావ ఏపీఎస్పీ కానిస్టేబుల్ వినోద్, ఆయన భార్య జ్యోతి సహకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించినట్లు సీఐ తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో 8 మందికి తీవ్ర గాయాలు

- వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్తుల వినతి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన రావెళ్ల వెంకాయమ్మ

వినుకొండ టౌన్, అక్టోబరు 06: పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుక్క కాటుకు గురైన బాధితులు వరుసపెట్టి 8 మందికి పైగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకుని గ్రామంలో విచారించగా కుక్కల బారి నుంచి కాపాడాలని బాధితులు వేడుకున్నారు. పిచ్చికుక్క గ్రామంలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పిల్లలు, వృద్ధులతోపాటు బర్రె దూడలపై దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పశువుల పాకలో పడుకుని ఉన్న రావెళ్ల వెంకాయమ్మపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో చేతికి 8 కుట్లుపడి తీవ్ర గాయాలైయ్యాయి. అదే కుక్క గ్రామంలో పుట్టబజారులోని తోట రంగయ్య కాలుపై దాడి చేసి తీవ్రంగా గాయ పర్చింది.

ఐదేళ్ల బాలుడిపై..

ఇదే పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వస్తున్న ఐదు సంవత్సరాల కొమ్మెర హరిహర రావు అనే బాలుడి కాలు పట్టుకుని ఈడ్చుకు పోతుండగా తల్లిదండ్రులు కేకలు వేశారు. గ్రామస్తులు వెంటపడడంతో పిల్లోడు ప్రాణాలు దక్కాయని స్థానికులు తెలిపారు. అదేవిధంగా ఆరు సంవత్సరాల వయసు గల కొమరగిరి శివకుమార్‌తో పాటు, ఎస్సీ కాలనీలో వల్లవరపు ఏసు దాసుతో పాటు, మరో ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిందన్నారు. ఇదే సమయంలో పాటిమీద బజారులో పశువుల పాకలో కట్టేసి ఉన్న మూడు దూడలపై దాడి చేసిందని బాల కోటయ్య, తిరుమలశెట్టి బుజ్జి వాపోయారు. బాధితులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందారు.

అధికారులు స్పందించాలి...

పిచ్చి, వీధి కుక్కల దాడిలో తరచూ ప్రజలు గాయాల పాలవుతున్నారు. అయినా స్థానిక పంచాయతీ అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీపై విచారణ

గుంటూరు(విద్య), అక్టోబరు 6: సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. మధుసూదనరావుపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలో ఉద్యోగుల బదిలీలు, నియామకాలు, హాస్టల్స్ నిర్వహణలో అక్రమాలు, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల్లో ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న సమయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈ ఏడాది జూలై నెలలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఇటీవల జరిగిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్ బదిలీల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ఆరోపణలపై విచారణ చేయాలని డీఆర్వో పెద్ది రోజాను కలెక్టర్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌పై చేసిన ఆరోపణలకు సంబంధించిన వివరాలతో హాజరుకావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్‌జీకి శనివారం కలెక్టరేట్ నుంచి లేఖ పంపారు.

పల్నాడు నుంచి డీటీ, వీఆర్వోల రిలీవింగ్‌లో జాప్యం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నుంచి గుంటూరు, బాపట్లకు బదిలీ అయిన రెవెన్యూ శాఖకు చెందిన వివిధ క్యాడర్ల ఉద్యోగుల రిలీవింగ్‌లో జాప్యం జరుగుతుంది. దీంతో బదిలీ అయినా, వారు పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. మరోవైపు గుంటూరు, బాపట్ల నుంచి పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్లిన వారికి ఈ కారణంగా ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. దాంతో వారు ప్రస్తుతానికి గాలిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా నుంచి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పోస్టింగ్‌లు కోరుకొని బదిలీ ఉత్తర్వులు కూడా అందుకున్న డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, ఇతర హోదాల అధికారులను తక్షణమే రిలీవ్ చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు విజ్ఞప్తి చేశారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి



కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, అక్టోబరు 6: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో కొండకు చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షం సందర్శించారు. అనుపులోని యాంపీ థియేటర్ అశ్వమేథ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ.90,450 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

సాగర్ కుడి కాలువలో గుర్తుతెలియని మృతదేహం

నకరికల్లు, అక్టోబరు 6: నాగార్జున సాగర్ కుడి కాలువలో నకరికల్లు మండలం గుండ్లపల్లి సమీపాన గుర్తుతెలియని మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. కాలువలో మృతదేహం ఉన్న విషయాన్ని నకరికల్లు పోలీసులకు సమాచారం అందించారు. కాగా పోలీసులు వెళ్లేసరికి మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్టు ఎస్ఐ తెలిపారు. అనంతరం సీఐ పోకూరి శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ సురేష్ కాలువ దిగువ ప్రాంతంలో లాకుల వద్ద మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. నీలిరంగు షర్ట్, నలుపు కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్, అక్టోబరు 06: నిమ్మచెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంగలకుదురు శివారులో నిమ్మతోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడకు వెళ్లి చూడగా నిమ్మ చెట్టుకు, మృతుని మెడకు బలంగా తాడు కట్టి ఉంది. మృతుడు కూర్చొని ఉండటాన్ని గుర్తించారు. అతడు రెండు రోజుల క్రితమే చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎరుపు రంగు టీషర్ట్, చేతికి ఎర్రటి రబ్బరు బ్యాండ్, గోధుమ కలర్ ఫ్యాంట్ ధరించిన సుమారు 30 ఏళ్ల వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ...



మాచర్ల రూరల్, అక్టోబరు 6: గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని కంభంపాడు కుడి కాలువ వద్ద జరిగింది. ఆదివారం కంభంపాడు కుడి కాలువ వద్ద ఓ మహిళ నిర్జీవ స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో ఆమెను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. మాచర్ల రూరల్ ఏఎస్ఐ రఫి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు రైతు మృతి

కొల్లూరు, అక్టోబరు 6: పాముకాటుకు రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఈపూరులంక గ్రామానికి చెందిన శొంఠి శ్యాంసన్ పొలం వద్ద పనులు చేస్తుండగా పాము రెండుసార్లు కాటు వేయడంతో గమనించి వైద్యం చేయించుకునేందుకు గ్రామంలోకి పరుగెత్తుకొస్తుండగా మార్గమధ్యలోనే పడిపోయి మృతి చెందాడు. గమనించిన రైతులు, కుటుంబ సభ్యులు పాము కాటుకు గురై రైతు మృతి చెందిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ రామయ్య సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈతకొడుతూ కాల్వలో కొట్టుకుపోయిన యువకుడు



షేక్ ఖాజా (ఫైల్ ఫొటో)

దుగ్గిరాల, అక్టోబరు 6: రేవేంద్రపాడు వద్ద రేపల్లె కాల్వలో యువకుడు ఈతకొడుతూ, ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లపూడికి చెందిన మహ్మద్ షేక్ ఖాజా ఆదివారం సాయంత్రం స్నేహితునితో కలిసి ఈతకొట్టేందుకు రేవేంద్రపాడు సమీపంలో రేపల్లె కాల్వ వద్దకు వచ్చాడు. కొద్దిసేపు ఈతకొట్టిన అనంతరం ప్రవాహ ఉధృతి అధికంగా ఉండటంతో ఈతకొడుతూనే ప్రవాహంలో కొట్టుకు పోయాడు. ఖాజా మంగళగిరిలో కార్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 6: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 588.60 అడుగులు ఉంది. ఇది 307.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 26,873, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,303 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 49,303 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 14,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 6: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 32 వేల క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు మేర ఎత్తి 14వేల 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 6 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 29,826 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 33,572 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు ఒక గేటు ద్వారా విడుదల చేస్తున్నారు. 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. పాత గుంటూరులోని యాదవ హైస్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. నిత్యం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తమ వంతుగా ముందుకొచ్చి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మలపాటి శ్రీనివాస్, వడ్లమూడి శివయ్య, కార్పొరేటర్ అశోక్, మీరావలి, జాగర్లమూడి శ్రీనివాస్, అల్లం బాజీ, జనసేన నాయకుడు శేఖర్, సాంబశివరావు, పఠాన్ జమీర్, కోటా పిచ్చిరెడ్డి, గాలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు చక్కటి చికిత్సలు

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడి

గుంటూరు (మెడికల్), అక్టోబరు 6 : ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైనదని, ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణ మూలంతో సహా వ్యాధులను నయం చేస్తుందని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎండీ, కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 120 పడకలతో తమ ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కేరళ పంచకర్మ వైద్య విధానం ద్వారా ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొట్టక్కల్ (కేరళ) ఆర్య వైద్యశాల అనుబంధంతో నయం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జరిగిన ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు ఆయుర్వేద వైద్యులు కశ్యప్, రాహుల్, ప్రణవి, ఐశ్వర్య, సుమారు 120 మంది రోగులకు నాడీ పరీక్షలు జరిపి రూ.90 వేలు విలువ గల ఆయుర్వేదిక్ మందులు, కేరళ తైలం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లీశ్వరి, కేరళ పంచకర్మ థెరపిస్టులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న కొండా వెంకటేశ్వర్లు

విద్యార్థులే సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్స్

గుంటూరు(విద్య), అక్టోబరు 6: విద్యార్థులే విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్స్ అని విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందంజలో ఉండాలన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు, యోగాకు ఎక్కువగా సమయాన్ని కేటాయించాలన్నారు. విద్య, ఉద్యోగం, ఆట, పాట... ఎందులో టాపర్‌గా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమని చెప్పారు. సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటపాటలు, సంగీత వాయిద్యాలతో కళాశాల ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్ర కుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డేలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వేద పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాల వితరణ

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసర నవరాత్రుల సందర్భంగా వేద పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బ్రాహ్మణ సేవా సమితి నూతన వస్త్రాలను వితరణ చేసింది. స్థానిక బ్రాడీపేట ఒకటో లైనులోని బ్రాహ్మణ సేవా సమితిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు రంగావఝ్ఝల లక్ష్మీపతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వావిలాల సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల ఉన్నతి కోసం తమ సమితి అనేక సేవలు చేస్తున్నదన్నారు. వృద్ధాశ్రమ నిర్వహణ, పేద బ్రాహ్మణ విద్యార్థుల కోసం వసతి గృహం నిర్వహణ ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజులలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేయడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త పాతూరి శ్రీనాథ్, కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఆదిరాజు శ్రీధర్, గొల్లపూడి రామకృష్ణారావు, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు జీవీఎల్ఎన్ సంజీవరావు, మతుకుమల్లి కోదండ రామారావు, పొత్తూరు మురళీమోహన్, మాదల వెంకటకృష్ణ, కటక రాజు సాయిబాబా శర్మ, బండారుపల్లి ప్రసాద్, సంబరాజు రవికుమార్, ఎమంగాదేవి పాల్గొన్నారు.



వేద పాఠశాల విద్యార్థులకు జరిగిన నూతన వస్త్రాల వితరణ కార్యక్రమం

కార్పొరేషన్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, అక్టోబరు 6 : మున్సిపల్ కార్పొరేషన్ ఎదురుగా గల కూడలి వద్ద సుమారు 50 - 55 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు, బ్లూ రంగు గడుల నిండు చేతులు గల చొక్కా, లేత ఆకుపచ్చ గల ప్యాంటు ఉండి కుడి కాలి పైన బ్యాండేజ్‌తో కట్టు కట్టబడి ఉంది. సదరు వ్యక్తి గాంధీ పార్కు చుట్టుపక్కల ఏరియాల్లో బిక్షాటన చేసుకుని తిరుగుతూ ఉంటాడని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

'పశ్చిమ'ను నిరుద్యోగ రహితంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో ఎమ్మెల్యే గల్లా మాధవి అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు భారీ స్పందన లభించింది. జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, అమర్ రాజా, ఈసీపీఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్, ఎంఆర్ఎఫ్ టైర్స్, హీరో, డైకిన్, ఎయిర్‌టెల్, స్విగ్గి, ఫోన్ పే వంటి ప్రతిష్టాత్మక సంస్థలు 42 పైగా పాల్గొన్నాయి. ఆ కంపెనీలు గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీ సిటీ, చెన్నై, బెంగళూరు, తిరుపతి వంటి ప్రాంతాల్లో వీరికి ఉద్యోగాలను కల్పించనున్నాయి. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గుంటూరు, పరిసర ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చారని, హెచ్ఆర్ అండ్ కో సహకారంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు సంస్థ ప్రతినిధులైన కార్తీక్, హర్ష 30కి పైగా కంపెనీలను సమన్వయం చేసుకొని జాబ్‌మేళాలో పాల్గొనేలా చేయడం అభినందనీయమన్నారు. దాదాపు 4 వేల మంది ఇక్కడికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మరో 2000 మంది ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఖర్చు మొత్తం కూడా తామే భరిస్తున్నామని, యువత నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయడం లేదని తెలిపారు. తొలిసారిగా దాదాపు 2,000 మందికి ఉద్యోగాలు ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆమె చెప్పారు. 1200 మందికి ఈ రోజే ఆఫర్ లెటర్లు ఇస్తున్నామని, మిగిలిన 800 మందికి ఇతర ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహితంగా చూడాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని, అందుకోసం ఇటువంటి మెగా జాబ్ మేళాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ఎమ్మెల్యే గల్లా మాధవి

శక్తి స్వరూపిణీ.. నమోస్తుతే

● శ్రీలలిత త్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ గాయత్రి దేవిగా అమ్మవారు



స్థానిక మల్లారెడ్డినగర్‌లో శ్రీ లలిత దేవిగా అమ్మవారు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6 : శ్రీదేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజున ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గో పూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకు మార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మ వారిని శ్రీ గాయత్రి దేవిగా, శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, చండీమాత, శ్రీ కాళికాదేవిగా, శ్రీ లలిత దేవిగా, శ్రీ మంగళ గౌరిదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి సంగీత కచేరిలు జరిగాయి. కార్యక్రమాలను పాలకవర్గ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ఏటీ అగ్రహారం శంకర గాయత్రీ దత్తసాయి మందిరంలో చండీదేవిగా...



కొత్తపేట జగన్నాథ స్వామి దేవాలయంలో సంతానలక్ష్మీగా...

● గుంటూరు, అక్టోబరు 6 : శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నగ రంలోని ప్రధాన దేవాలయాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవారు పలు అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు ఆదివారం శ్రీ పుష్పశయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లాలాపేట గంటలమ్మ చెట్టు వీధిలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ పుష్పశయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలానే సంగడిగుంట వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారిని అలంకరించారు. చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



సంగడిగుంట శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



చుట్టుగుంట పోలేరమ్మ ఆలయంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణ

● గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 6 : లాలాపేట గ్రూపు దేవాలయాల పరిధిలోని పాత బస్టాండ్ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో, కొత్తపేట రుక్మిణి సత్యభామ సమేత జగన్నాథ స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని పద్మావతి అమ్మవారు ధాన్య లక్ష్మీదేవిగా, జగన్నాథ స్వామి దేవస్థానంలోని రుక్మిణి దేవి అమ్మవారు సంతాన లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను ఆలయంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర తెలిపారు.



వాయిద్యాలతో అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి సారె బహూకరణ

● శాస్త్రోక్తంగా పూజలు

గుంటూరు, అక్టోబరు 6 : పొన్నూరు రోడ్డులోని సంగడిగుంట వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పాలకవర్గ సభ్యులు శాస్త్రోక్తంగా సారె బహూకరించారు. శ్రీ సీతారామ మందిర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, సెక్రెటరీ కల్లి సుందర రామిరెడ్డి, శివశంకరరావు, బత్తిని సాంబశివరావు, దండేశ్వరరావు, మారెడ్డి నరసింహారెడ్డి, పలువురు మహిళా భక్తుల ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, కనక వాయిద్యాలతో శాస్త్రోక్తంగా అమ్మవారికి సారె సమర్పించారు. నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీ మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ట్రెజరర్ కల్లి శ్రీనివాస రెడ్డి, అరవపల్లి సాంబశివ రావు తదితరులున్నారు.

అలరించిన భక్తిగీతాలాపన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6 : బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా అన్నమయ్య కళావేదికగా ఎంవీ రత్తయ్య, సుజాత ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర భజన సమాజం, పెదవడ్లపూడి బృందం భక్తిగీతాలాపన జరిగింది. స్వామి, అమ్మవార్ల కీర్తనలను చక్కగా గానం చేశారు. సత్సంగ సభ్యులచే లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న కళాకారులు

కుగ్లర్ ఆస్పత్రి కాంపౌండ్‌లోని క్వార్టర్స్‌లో చోరీ

గుంటూరు, అక్టోబరు 6 : స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుగ్లర్ ఆసుపత్రి కాంపౌండ్‌లో గల ఓ క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. భీమరాజు అనే వ్యక్తి కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్ళారు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటిలోని బంగారు గొలుసు, చెవి కమ్మలు, గాజు చోరీకి గురయ్యాయి. దొంగలు ఇంటి వెనుక బాత్‌రూమ్ పైన ఉన్న సిమెంట్ రేకులు పగలకొట్టి దాని ద్వారా లోనికి ప్రవేశించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలపర్రులో ఎమ్మెల్యే మాధవి దంపతుల పూజలు

పెదనందిపాడు, అక్టోబరు 6 : మండల పరిధిలోని పాలపర్రు సూర్యేశ్వర సోమేశ్వర దేవస్థానంలో దేవి నవరాత్రులలో భాగంగా స్వామి వారికి జరిపిన విశేష పూజలలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు ఆదివారం పాల్గొన్నారు. స్వామి వారికి విశేష అలంకరణల అనంతరం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలలో పాల్గొన్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి దంపతులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6 : స్థానిక కొత్తపేట గుంటగ్రౌండ్ ఫ్యాన్సీ మర్చంట్ కళ్యాణ మండపంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 600 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, 50 మంది విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున 50 వేల రూపాయల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు మాట్లాడుతూ సమాజ హిత కార్యక్రమాల ద్వారా లక్ష రూపాయలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందించటం వాసవిమాత కటాక్షంగా భావిస్తున్నట్లు అన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కొత్తూరు వెంకట నరసింహారావు, చౌట ఉమామహేశ్వరరావు, చుండూరు దామోదరరావు, కాకర్ల హనుమంతరావు, ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు, రంగా రామకృష్ణ, అచ్యుత నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న వాసవి మాత సమితి సభ్యులు

ప్లంబర్ అనుమానాస్పద మృతి



దేవానంద్ మృతదేహం

గుంటూరు, అక్టోబరు 6 : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు సమీపంలో కంకరగుంట 8వ లైనుకు చెందిన పచ్చల దేవానంద్ (53) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారం సాయంత్రం నుంచి కంకరగుంట బ్రిడ్జి నుంచి పట్టాభిపురం స్టేషన్‌కు వెళ్ళే రోడ్డు మూల మీద చెట్టు కిందమద్యం సేవించి కూర్చున్నాడు. ఆదివారం మధ్యాహ్నం చూడగా దేవానంద్ మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల వారిని విచారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మద్యం సేవించిన నేపథ్యంలో గొంతు తడి ఆరిపోయి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హృద్రోగానికి స్టెమ్‌సెల్ థెరపీతో చెక్!

● కార్డియోమయోపతికి నూతన చికిత్స

● శ్రీ హాస్పిటల్‌లో మూలకణ చికిత్సలు

గుంటూరు (మెడికల్) అక్టోబరు 6 : డయలేటెడ్ కార్డియోమయోపతి రోగులకు మూలకణ చికిత్సలతో (స్టెమ్ సెల్స్ థెరపీ) చక్కటి ఫలితాలు సాధించవచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ బీవీ నారాయణరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని శ్రీ హాస్పిటల్స్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలికి చెందిన చుండూరి వెంకట శివప్రసాద్ (58) మూడేళ్లుగా డైలేటెడ్ కార్డియోమయోపతితో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇతడికి రెండు నెలల కిందట శ్రీ హాస్పిటల్స్‌లో ఆటోలోగస్ బోన్‌మ్యారో డెరీవ్డ్ మోనో న్యూక్లియస్ స్టెమ్‌సెల్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేసినట్లు చెప్పారు. గతంలో ఇతడికి గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకోవాలని హైదరాబాద్‌లో ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు సూచించినట్లు డాక్టర్ నారాయణరెడ్డి చెప్పారు. మూలకణ చికిత్స తర్వాత గుండె పని తీరు (ఇంజెక్షన్ ఫ్రాక్షన్ రేట్) బాగా మెరుగైనట్లు తెలిపారు. రోగి ఆరోగ్యం మెరుగవ్వడంతో తన పని తాను చేసుకుంటున్నట్లు డాక్టర్ నారాయణరెడ్డి చెప్పారు. స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఏ విజయ్ రాకేష్‌తో మాట్లాడుతూ ఇప్పటి వరకు 20 మంది హృద్రోగులకు ఈ నూతన వైద్య విధానంలో చికిత్సలు చేయగా, అందరి ఆరోగ్య పరిస్థితి బాగా మెరుగైంది. గుండె పంపింగ్ శక్తి గతంలో కంటే రెట్టింపు పెరిగిందని తెలిపారు. గుండె పంపింగ్ శక్తిని బట్టి రోగులను సివియర్, మోడరేట్, మైల్డ్ కేసులుగా గుర్తిస్తామని స్టెమ్‌సెల్ థెరపీ తర్వాత సివియర్ రోగులు మోడరేట్ స్థాయికి, మోడరేట్ రోగులు మైల్డ్ స్థాయికి మెరుగయ్యారని తెలిపారు.



మూలకణ చికిత్స చేస్తున్న నారాయణరెడ్డి, ఇన్‌సెట్లో శివశంకర్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సలహా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

గుంటూరు(విద్య), అక్టోబరు 6 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించడం హర్షణీయమని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ వద్ద ఏర్పాటు చేసి సలహా కేంద్రాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినవారు కూడా నూతనంగా ఈ ఎన్నికకు ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఓటు నమోదు కోసం 2021 నుంచి అక్టోబరు 31లోపు డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులనే విషయం తెలియజేయాలని సూచించారు. అర్హులైన ఓటర్లు నవంబరు 6వ తేదీలోగా సంబంధిత డాక్యుమెంట్స్ అటెస్టేషన్ చేయించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో మీ ఓటు పొందవచ్చు అన్నారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన స్థానిక కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ తదితరుల్ని ఎమ్మెల్యే మాధవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, నవీన్ చౌదరి, రాధ తదితరులు పాల్గొన్నారు.



ఓటు నమోదు ఫారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి తదితరులు

ఆధునిక వైద్యం, మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

● సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్రకుమార్

గుంటూరు, అక్టోబరు 6: ఆధునిక వైద్యంతో పాటు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఫణీంద్రకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'క్యాన్సర్ వ్యాధి-కారణాలు-చికిత్స' అన్న అంశంపై ఆదివారం జరిగిన ఆరోగ్య సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానాలతో పాటు రోగిలో మొక్కవోని మనోధైర్యం నింపటం క్యాన్సర్ పై విజయంలో కీలకంగా నిలుస్తుందన్నారు. క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు అధికంగా ఉంటున్నాయని, పురుషుల్లో పెదవి, నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని, మద్యపానం, ధూమపానం లాంటి దుర్వసనాలకు దూరంగా ఉండాలని, బయట ఆహారానికి దూరంగా ఉంటూ స్థూలకాయం నుంచి విముక్తి అవుతూ సమతుల ఆహారం, సరైన జీవనశైలితో క్యాన్సర్‌కి చెక్ పెట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు టీవీ సాయిరాం, చల్లా అంజిరెడ్డి, రవిచంద్ర, భావన్నారాయణ తదితరులున్నారు.



సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఫణీంద్రకుమార్ తదితరులు

ముగిసిన సీనియర్ ఫుట్‌బాల్ జిల్లా ఎంపికలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 6 : ఫుట్‌బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక పేరేచర్ల మైదానంలో ఆదివారం సీనియర్ బాలుర విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు ముగిసాయి. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శి దుర్గామోహన్ మాట్లాడుతూ ఎంపికలకు దాదాపు 45 మంది క్రీడాకారులు హాజరైనట్టు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8వ తేది నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ బ్రహ్మం, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు. అసోసియేషన్ సభ్యులు

ఈ వారం వచన కవితల పోటీ విజేతలు

గుంటూరు, అక్టోబరు 6 : వారం వారం అమరావతి సాహితీ మిత్రులు ఫేస్ బుక్ గ్రూపులో డాక్టర్ రావి రంగారావు నిర్వహిస్తున్న కవితల పోటీల ఫలితాలు ఆదివారం ప్రకటించారు. ఈ వారం వచన కవితల పోటీ అంశం 'దారి మళ్లింపు'. ఈ పోటీలో ముగ్గురి కవితలు ప్రశంసా పత్రాలు పొందినట్లు పేర్కొన్నారు. గోలి హనుమచ్ఛాస్త్రి (గుంటూరు), లీలా కృష్ణ (తెనాలి), దయా డీ మాన్ (సిద్దిపేట, తెలంగాణ) విజేతలుగా ప్రకటించి అభినందించారు.



కెఆర్‌కొండూరులో శ్రీగాయత్రీదేవిగా ..



తుళ్లూరులో బాలా త్రిపుర సుందరి దేవీగా



పెదనందిపాడులో బాలా త్రిపుర సుందరి దేవీగా

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దుగ్గిరాల, అక్టోబరు 6: మండలంలోని పలుగ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో నాల్గోరోజు శరన్నవరాత్రి ఉత్సవాలతో అమ్మవారి ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. దుగ్గిరాల గంగాపార్వతీసమేత నాగేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారు శ్రీలలితాత్రిపురసుందరదీదేవిగానూ, కేఆర్ కొండూరు మహంకాళీ అమ్మవారు శుక్రవారం భద్రకాళీదేవిగా, భక్తులకు దర్శన మిచ్చారు. మహిళా భక్తులు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు.

తుళ్లూరు: బాలా త్రిపుర సుందరి దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలో అన్ని శివాలయాల్లో అమ్మవార్లకు, పెదపరిమి తెలుగు యువత ఆధ్వర్యంలో భారీగా గుడి సెట్టింగ్‌వేసి నెలకొల్పిన అమ్మవారు, తుళ్లూరులో మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు, తూర్పు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారికి నవరాత్రుల 4వ రోజున బాలా త్రిపుర సుందరి దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలును అందజేశారు.

పెదనందిపాడు : మండలంలోని ఆయా దేవస్థానాల్లో కొలువుదీరిన అమ్మవార్లను ఆయా కమిటీ సభ్యులు వివిధ రూపాల్లో అలంకరించారు. జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని పట్టు చీరలతో అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గీతారామాంజనేయ భక్తభజన సమాజం పెదనందిపాడు వారిచే భజనా సంకీర్తన చేశారు.

తాడేపల్లి/తాడేపల్లిటౌన్: తాడేపల్లి ఉండవల్లి సెంటర్‌లోని అయోధ్య ప్రాంగణంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం 4వ రోజుకు చేరుకున్నాయి. పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అయోధ్య ప్రాంగణం కమిటి సభ్యులు లింగంశెట్టి కిషోర్‌కుమార్, జంగాల వెంకటేష్, శ్రీనివాస శాస్త్రి, గోపాలం కొండలరావు, రాజా రమేష్, పెండ్యాల వెంకటరావు, రామస్వామి, పిచ్చయ్య, లీలాకృష్ణ, ప్రదీప్‌రెడ్డి, రవి ఇతర కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

తాడేపల్లి, అక్టోబరు 6: నూతన విద్యుత్ లైన్ల నిర్మాణం నిమిత్తం కరకట్ట ప్రాంతం విజయవాడ క్లబ్ నుండి ప్రాతూరు డౌన్ వరకు సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ గాజుల సురేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు పాలస్తీనా సంఘీభావం దినం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 6: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినాన్ని నిర్వహిస్తున్నట్టు పట్టణ సీపీఎం కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు సీపీఐ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు. ఆదివారం తాడేపల్లి సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించారు. సోమవారం జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు డీవీ భాస్కరరెడ్డి, బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మపూడిలో కౌలురైతులతో కలిసి మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలి

దుగ్గిరాల, అక్టోబరు 6: అధిక వర్షాలు, వరదలకు వరి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, కంద, పసుపు తదితర వాణిజ్యపంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.60 చొప్పున పరిహారం అందించాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకర్ అన్నారు. తుమ్మపూడి, చిలువూరు గ్రామాల్లో ఇటీవల కృష్ణానది వరదలకు, అధిక వర్షాలకు పంట నష్టపోయిన కౌలు రైతు, రైతులను వారు పరామర్శించారు. పంట నష్ట పరిహారం అందిందా లేదా అన్న విషయంపై ఆరా తీశారు. ప్రభుత్వం వరికి ఎకరాకు రూ.10వేలు, వాణిజ్యపంటలకు రూ.14వేలు ప్రకటించారని, అదికూడా ఐదెకరాలకు మించి ఇవ్వడంలేదని విమర్శించారు. సుఖీభవ హామీ ప్రకారం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో తక్షణ మే జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్నవ నాగమల్లేశ్వరరావు, జెట్టి బాలరాజు, బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, మరియదాసు, శ్రీనివాస్, ప్రసాద్, సుబ్బారావు, జార్జి పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

తుళ్లూరు, అక్టోబర్ 6: 'ప్రధాన రహదారుల మరమ్మతులు చేయండి.. ప్రయాణించాలంటే నరకం కనబడుతుంది' అని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుళ్లూరు నుంచి అమరావతి, విజయవాడ వెళ్లే అర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారై ఉంది. అలాగే తుళ్లూరు రాయపూడి మధ్య కూడా రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడిన ఆ రహదార్ల మీద ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. తరచూ ప్రమాదాల భారినపడుతున్నారు. ఆయా రహదారకుఒ కనీసం మరమ్మతులైనా చేయండని కోరుతున్నారు.



శేషగిరిరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

బత్తిని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పెదనందిపాడు, అక్టోబరు, 6 : మండల పరిధిలోని కొప్పర్రులో ఇటీవల మృతి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు బత్తిని శేషగిరిరావు కుటుంబాన్ని పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి సుధీర్ఘకాలంగా ఎనలేని సేవలందించి, సహకార సొసైటీ అధ్యక్షుడిగా రైతులకు ఎన్నో సేవలందించారని, ఆయన మృతి ఇటు పార్టీకి, గ్రామానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో కుటుంబ సభ్యులు టీడీపీ మండల అధ్యక్షులుగా, మాజీ జడ్పీటీసీ సభ్యులుగా బత్తిని శారదా వేణులు పని చేసి మండల అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని తెలిపారు. ఆయన వెంట సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి, అక్టోబరు 6: తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంలో విజయవాడ రమేష్ హాస్పిటల్స్ వారి ఆస్టర్ రమేష్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం వారి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక లింగంశెట్టి అసోసియేట్స్, మారుతీ ఫౌండేషన్ సహకారంతో ఉండవల్లి సెంటర్ వంశీ అకాడమిలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. గుండె, నరాలు, ఎముకలు, కీళ్ళవ్యాధులు, స్త్రీ ప్రసూతి, ఈసీజీ, ఎకో, బీపీ, షుగరు పరీక్షలకు సంబంధించి 200 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ ఎన్ రాజారమేష్, బీ. అనూష, కే. భరత్‌చంద్ర, జీ. మమత, శ్రీనయన కొల్లి, ఆస్టర్ రమేష్ వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే కూటమి పాలన
- సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు చర్యలు
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- టీడీపీ నేతలు, శ్రేణులతో ఆత్మీయ సమావేశం

వట్టిచెరుకూరు, అక్టోబరు 6 : గుంటూరు ఛానల్ పొడిగింపు, అభివృద్ధి, కాలువల్లో పూడికతీత వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కేంద్రగ్రామీణాభివృద్ధి సమాచార ప్రచారాలశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రం వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆడిటోరియంలో వట్టిచెరుకూరు మండల గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే బూర్ల ఆంజనేయులు పాల్గొన్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అందరి ఉత్సాహం చూస్తుంటే ఎన్నికల ప్రచారానికి వచ్చినరోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. నియోజక వర్గ ప్రజల చిరకాల వాంఛగా మిగిలి పోయిన గుంటూరు ఛానల్ పొడిగింపు, అభివృద్ధి కాలువల్లో పూడిక తీత వంటి పనులను దీర్ఘకాలిక ప్రణాళికతో వేగంగా చేపట్టి చూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ ఉపాధి హామి పథకం కింద రాష్ట్రానికి నిధులు మంజూరయ్యాయని, అందులో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఒక్కొక్క గ్రామానికి రూ.60 లక్షలు మంజూరయ్యాయని, తన తరుపన కూడా ఎన్నో రోడ్లు మంజూరు చేశారన్నారు. తన సొంత నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కలిగిన స్కూళ్ళను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల పై అన్యాయంగా పెట్టిన కేసులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని, అందుకు న్యాయపరంగా అవసరమైన ఖర్చులను తానే సొంతంగా భరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ ప్రయత్నంలో ఎమ్మెల్యే రామాంజనేయులు కూడా భాగస్వామికావడం హర్షణీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతల నిర్వహణకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. తనను అఖండ మెజార్టీతో గెలిపించి ఈస్థాయికి చేర్చిన ప్రజల రునం తీర్చుకుంటానన్నారు.

కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు వందనాదేవి, ఉగ్గిరాల సీతారామయ్య, పత్తి భావన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, వట్టిచెరుకూరు గ్రామ పార్టీ అధ్యక్షులు ఏ శివయ్య, సర్పంచ్ విజయ కుమార్, ఉప సర్పంచ్ ఏ సత్యనారాయణ, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, అనంతవరప్పాడు సర్పంచ్ దారా వెంకటరావు, ముప్పా అంకమరావు, మాజీ సర్పంచ్‌లు కొర్రపాటి సాంబశివరావు, జెట్టి సుబ్బారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెండ్యాల శ్రీధర్, మన్నవ వంశీ, నాగిశెట్టి నాగరాజు, వీరిశెట్టి జగన్‌మోహన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



నండూరి సుందరరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వివేకం, వివేచనతో కూడిన విద్య కావాలి

ఫిరంగిపురం, అక్టోబరు 6 : వివేకం, వివేచనతో కూడిన విద్యను సమాజానికి అందించటం అత్యంత ఆవశ్యమని గుంటూరు, పల్నాడు జిల్లాల ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు నూతలపాటి సింగయ్య అన్నారు. పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన నండూరి సుందరరరావు సన్మాన సభ కార్యక్రమాన్ని ఆదివారం ఫిరంగిపురంలోని ఎంపీడీవో కార్యాలయంలోనిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మెప్మా డైరెక్టర్ నలుకుర్తి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సుందరరావు ఉపాధ్యాయుడిగా చేసిన సేవలు అజరామరమైనవని అన్నారు. అనంతరం 1986 - 87 బ్యాచ్ సెయింట్ పాల్స్ హైస్కూలు 10వ తరగతి పూర్వ విద్యార్థులు నండూరి సుందరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాసరి జయరాజు, కమ్ముల శ్రీనివాస్, కోటేశ్వరరావు, కంజుల శ్రీధర్, రేపూడి వెంకట రమణ, చిట్టా లక్ష్మీరెడ్డి, బాష్యం వెంకటేశ్వరరావు, జోజప్ప, జమాల్, ఆనందరావు, మరియమ్మ, బాబూరావు, పాపారావులు పాల్గొన్నారు.

బ్లేడుతో వ్యకిపై దాడి

ప్రత్తిపాడు, అక్టోబరు 6: బ్లేడుతో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో ఆదివారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగిపురం గ్రామానికి చెందిన ఆరుమళ్ల మోహన్ గ్రామంలోని మెడికల్ షాపు వద్దకు వెళుతుండగా కొండేపాటి ఏసుబాబు, కారుమూరి బాలస్వామిలు మోహన్‌ను ఆపి అతనిపై బ్లేడుతో దాడి చేశారు. ఈ క్రమంలో ఏసుబాబు బ్లేడుతో మోహన్ గొంతుకోసే ప్రయత్నం చేయగా తృటిలో తప్పించుకున్నాడు. అయితే మోహన్ గొంతు కింద బాగంలో బ్లేడు కోసుకు పోయింది. వెంటనే అతన్ని 108 అంబులెన్సులో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైతులకు కరపత్రాలు అందజేస్తున్న రైతు సంఘం నేత వెంకటశివరావు

8న విజయవాడలో కౌలురైతు సదస్సు

పెదనందిపాడు, అక్టోబరు, 6: విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 8న జరిగే కౌలురైతుల సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. ఏపీ రైతు సంఘ, కౌలు రైతు సంఘం పిలుపు మేరకు మండల పరిధిలోని పెదనందిపాడు, వరగాని, నాగులపాడు గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘ రాష్ట్ర నేతలు ప్రసంగిస్తారని, రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చుక్కా యానాదులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెదనందిపాడు, అక్టోబరు, 6 : గుంటూరు - పర్చూరు రహదారిలో అబ్బినేనిగుంటపాలెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాపట్ల జిల్లా నరసాయపాలెంకు చెందిన జయరావు ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఏబీపాలెం సాగర్ కాలువ సమీపంలో ఎదురుగా ఉన్న గుంటను తప్పించబోయి వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయమైంది. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా గుంటూరు జీజీహెచ్‌కు క్షతగాత్రుడిని తరలించారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

దుగ్గిరాల, అక్టోబరు 6: పంచాయతీరాజ్ చట్టం 1994పై అవగాహన, పంచాయతీ పాలనపై గ్రామ సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఆయా పంచాయతీల నుంచి ఇద్దరు చొప్పున వార్డుసభ్యులు (ఒక స్త్రీ, ఒక పురుషుడు) ఈ శిక్షణలో పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

లూథరన్ చర్చికి రూ.25వేల విరాళం

తాడేపల్లి, అక్టోబరు 6: పెనుమాక గ్రామంలోని క్రీస్తు కృపాలయ లూథరన్ చర్చి ప్రహరీ నిర్మాణం కోసం మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో తాడేపల్లి మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేష ఆదివారం రూ.25 వేల విరాళం అందించారు. చర్చి పాస్టర్, సంఘస్తులు పెద్దల సమక్షంలో ఈ విరాళాన్ని అందజేసి చర్చి అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాస్టర్, సంఘస్తులు కొల్లి శేషను అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తుళ్లూరు, అక్టోబరు 6: మండలంలోని ఐనవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం తుళ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో సేకరించి ఉంచిన రేషన్ బియ్యం 50 బస్తాలను తరలించేందుకు సిద్ధం చేస్తుండగా స్వాధీనం చేసుకున్నామని సీఐ-1 గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనలో అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన పులివెందుల రాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ -1 తెలిపారు.

బోర్లకు మరమ్మతులు

మంగళగిరి, అక్టోబరు 6: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి నియోజకవర్గంలోని బోర్లకు ఎంటీఎంసీ సిబ్బంది మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మంగళగిరి మండలం నిడమర్రు, శిబిరం, తాడేపల్లి 9వ వార్డులో చేతి పంపులు పాడైపోయిన విషయాన్ని స్థానికులు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన లోకేశ్ వెంటనే బోర్లకు మరమ్మతులు చేయించాలని ఎంటీఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతో పాడైపోయిన బోర్లకు ఆదివారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.



ఆలయంలో హారతి తీసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల

ఆలయంలో కేంద్ర సహాయ మంత్రి పూజలు

పెదనందిపాడు, అక్టోబరు, 6 :మండల పరిధిలోని వరగాని గ్రామంలోగల పోలేరమ్మతల్లి దేవస్థానం వద్ద దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కనదుర్గమ్మ అమ్మ వారిని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలిసారిగా మండలానికి విచ్చేసిన పెమ్మసానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వరగాని ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పెమ్మసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, జంపని హనుమంతరావు, చెన్నుపాటి సురేంద్ర, పెంట్యాల శ్రీధర్, రావి శివరామకృష్ణయ్య, పోపూరి వెంకటప్పయ్య, జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, బండారు రాంబాబు, చీరాల పెద్దన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



విరాళం చెక్కును మంత్రి మనోహర్‌కు అందజేస్తున్న ఎలైట్ గ్రూప్ సభ్యులు

పార్క్ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 6: పట్టణంలోని చినరావూరు పార్క్ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చినరావూరు పార్క్‌లో మునిసిపల్ మాజీ చైర్మన్ కొత్తమాసు తులసీదాసు జ్ఞాపకార్థం వారి కుమారుడు కొత్తమాసు కుమార్ రూ.5లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు మునిసిపల్ కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కు రూ.1లక్ష 41వేలు విరాళం

సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కు రూ. 1.41వేలు విరాళంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎలైట్ గ్రూప్ సభ్యులు అందజేశారు. పేదల అవసరాలకోసం, రాష్ట్ర ప్రగతికి ఎలైట్ గ్రూప్ సభ్యులు ముందుకు రావడాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

పార్క్ నిర్వహణలో బాధ్యతగా మెలగండి

పట్టణంలోని చినరావూరు పార్క్ నిర్వహణలో అధికారులు, సిబ్బంది బాధ్యతగా మెలగాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. ఆదివారం చినరావూరు పార్క్‌ను సందర్శించిన మంత్రి మనోహర్ అక్కడ పలు లోపాలను గుర్తించారు. దీనిపై అధికారులు, సిబ్బందిని పిలిచి పార్క్‌కు వచ్చే ప్రజలకు, చిన్నారులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు మునిసిపల్ అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరులు అరెస్టు

కొల్లిపర, అక్టోబరు 6: మండలంలోని గ్రామాల్లో ఆదివారం జూదరులపై దాడులు నిర్వహించగా మున్నంగిలో 9మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర మండలం మున్నంగి పంట పొలంలో 9మంది జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.15వేల 150లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

తెనాలి రూరల్, అక్టోబరు 4: పట్టణంలోని కొత్తపేట శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కావేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ, తెనాలి రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావులు తెలిపారు. తెనాలి నియోజకవర్గం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, పలు శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. తెనాలి నియోజవర్గవ్యాప్తంగా సమస్యలున్న వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సీఐ ఓ ప్రకటనలో తెలిపారు.



జనసేనలో చేరిన మాజీకౌన్సిలర్ విజయరాణి తదితరులతో మంత్రి మనోహర్

పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజలకు మంచి చేయండి

● జనసేనలో చేరిన మాజీ కౌన్సిలర్‌తో మంత్రి మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 6: పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజలకు మంచి జరిగేలా చూడాలని జనసేన పీఏసీ చైర్మన్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ సమక్షంలో మాజీ కౌన్సిలర్, వీవర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు దామర్ల విజయరాణి ఆమె మిత్రబృందం జనసేన పార్టీలో చేరారు. వారిని మంత్రి మనోహర్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి కాలనీలో సమస్యలను పరిష్కరించండి

● గృహ సంక్షేమ సంఘ అధ్యక్షుడు నారాయణరావు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 6: అమరావతి కాలనీలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని అమరావతి కాలనీ గృహ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు అధికారులను కోరారు. స్థానిక అమరావతి కాలనీలో కమ్యూనిటీ సెంటర్‌లో అమరావతి కాలనీ గృహ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాలనీలోని పలు సమస్యలపై సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారని తెలిపారు. ముఖ్యంగా కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారుల మరమ్మతులు, డ్రెయిన్స్ నిర్మాణాలు, రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్‌లు 667 గృహాలకు అమర్చాలని, కాలనీలోని పార్కులకు కేటాయించిన స్థలాలను పార్కుల కోసం మాత్రమే వినియోగించాలని, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులను జిల్లా వైద్యశాల మీదగా వెళ్లేలా ఏర్పాటు చేయాలని, గృహ విద్యుత్ చార్జీలను, ఆస్తి పన్నులను తగ్గించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. తక్షణమే అమరావతి కాలనీ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జయపాల్, జి.పూర్ణచంద్రరావు, బి.రాంమ్మోహనరావు, వై వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్తీలపై వైసీపీ నేతలది బుకాయింపే

● గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి

తెనాలి రూరల్, అక్టోబరు 6: కల్తీ నెయ్యి, కల్తీ మద్యంపై వైసీపీ నాయకులు చేస్తున్నది బుకాయింపేనని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కల్తీ ఏదో మంచిదేదో తెలుసుకోలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకుందని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి సంపూర్ణంగా మద్యాన్ని నిషేధిస్తానని అక్కచెల్లెమ్మలకు చెప్పి బూంబూం, ప్రెసిడెంట్ అంటూ విచిత్రమైన పేర్లతో కల్తీ మద్యాన్ని తయారుచేసి అక్కచెల్లెమ్మల పసుపు కుంకుమలతో చెలగాటమాడి, లక్షల కోట్ల డబ్బును వెనకేసుకున్నారని ఆరోపించారు. అలాగే కోట్లాదిమంది భక్తులు దర్శించుకునే తిరుమలస్వామి వారి లడ్డులో కల్తీకి తెరలేపి భక్తుల మనోభావాలతో ఆడుకున్నారన్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం పరీక్షలు చేయించగా కల్తీ వ్యవహారం బట్టబయలైందన్నారు. కల్తీ జరగలేదంటూ వైసీపీ నేతలు బుకాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పుకు క్షమాపణ చెప్పాలని వీరవల్లి మురళి డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రతను పెంచేలా పాలన చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోలేరమ్మ గుడికి మైక్‌సెట్ బహూకరణ

తెనాలి, మారీసుపేట అక్టోబరు 6: స్థానిక పాండురంగపేట వేజళ్ళ వారి వీధిలోని పోలేరమ్మతల్లి గుడికి ఆదివారం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరావు దశరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మైక్ సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పోలేరమ్మతల్లి గుడి నిర్వాహకులు తెనాలి ట్రాన్స్‌జెండర్స్ లీడర్ ప్రీతి వెంకటేశ్వరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాస్టారు, వాసిరెడ్డి వెంకటేశ్వరావు, మైలా పాపారావు, భాస్కరావు, కేసన అశోక్, పడమటి సాయికృష్ణ, ట్రాన్స్‌జెండర్స్ గాయత్రి, కల్పన, అను, ప్రసన్న, మల్లేశ్వరి, మైధిలీ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

● సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ హేమశంకర్‌రావు

తెనాలి రూరల్, అక్టోబరు 6: ఈ నెల 20న తెనాలి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న ధార్మిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ జంజనం హేమశంకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని గోవర్ధనస్వామి దేవాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్ ధార్మిక కమిటీ కన్వీనర్లందరూ ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొని హిందూ ధర్మ పరిరక్షణకు పాటుబడాలని ఆయన కోరారు. మండల కన్వీనర్ దీపాల మహేష్, నగర కన్వీనర్ కోనపురెడ్డి, బైరాగి, కౌతరపు రామచంద్రరావు, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా మారిన నాడెపు తొట్టెలు, ఖాళీగా దర్శనమిస్తున్న వర్మి తొట్టెలు

సంపద సృష్టిపై చిత్తశుద్ధి ఏది..!?

● నిరుపయోగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు
● సంపద సృష్టిపై లేని చిత్తశుద్ధి
● గ్రామాలలో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు
● తుప్పుపడుతున్న యంత్రసామగ్రి



చింతలపూడిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

పొన్నూరు టౌన్, అక్టోబరు 6: ప్రతి గ్రామ పంచాయతీని స్వచ్ఛ గ్రామంగా మార్చేందుకు గ్రామాలలో పోగవుతున్న చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఏర్పాటుచేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. 2014తర్వాత రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షల వ్యయంతో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీలో పోగవుతున్న చెత్తను నిరోధించటం అతిపెద్ద సమస్యగా మారింది. ఈ చెత్తను గ్రామాలో రహదారుల వెంట ఖాళీ ప్రదేశాలో వదిలివేయటం ద్వారా పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు పరిష్కార మార్గాలుగా ప్రభుత్వం గుర్తించింది. అయితే 2019 తర్వాత ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామాలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలే దర్శనం ఇస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం మారిపోవటంతో నూతన ప్రభుత్వం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది.

తుప్పుపడుతున్న యంత్ర సామాగ్రి

గత ఐదు సంవత్సరాలుగా ఈ ప్లాంట్ నిర్వహణ లేకపోవటంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్లాంట్లలో గాజు సీసాలు, పెంకులు పొడి చేయటానికి, ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రాన్యూల్స్‌గా మార్చటానికి లక్షలాది రూపాయల వ్యయంతో ప్రభుత్వం యంత్రాలను సమకూర్చింది. ఈ యంత్రాలు నిర్వహణ లోపంతో మూలనపడి తుప్పుపడుతున్నాయి. అంతేకాకుండా జనాభా ప్రాతిపదికన కేటాయించిన చెత్త సేకరించే రిక్షాలు కూడా తుప్పుపట్టి మూలనపడ్డాయి. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లలో సేకరించిన తడిచెత్తను వానపాములతో వర్మీ కంపోస్ట్ తయారీకి వినియోగించేందుకు ఏర్పాటుచేసిన నాడెపు తొట్టెలు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గతంలో గ్రామాలలో గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్ల పేరుతో కార్మికులను నియమించారు. కాలక్రమేనా వీరికి వేతనాలు చెల్లించకపోవటంతో గ్రీన్ అంబాసిడర్లు విధులు మానుకుని వెళ్లిపోయారు. ఘన వ్యర్థాల ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని పెంచే ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు అలంకారప్రాయంగా మారిపోయాయని ప్రజలలో ఆవేదన వ్యక్తం అవుతోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వర్మీ కంపోస్టు యూనిట్లు సైతం నిరుపయోగంగా మారిపోయాయి. అంతేకాకుండా ప్లాంట్ల నిర్వహణ లేకపోవటంతో సేకరించిన చెత్తను కార్మికులు రహదారుల వెంట వదిలివేయటంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి గ్రామాలో పారిశుధ్య చర్యలను మెరుగుపరచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం

విగ్రహావిష్కరణ సభలో మంద కృష్ణమాదిగ



జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ

తెనాలి రూరల్, అక్టోబరు 6: దేశంలో సాంఘిక దురాచారాలున్నంతకాలం రిజర్వేషన్లు అమల్లో ఉండాలని పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం తెనాలి పట్టణంలోని చినరావూరులో బాబుజగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి మంద కృష్ణమాదిగ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన మహనీయులు జగ్జీవన్‌రామ్ అన్నారు. దాదాపుగా 52 సంవత్సరాలు దేశానికి ఆయన విశేషమైన సేవలందించారన్నారు. పలు కీలక శాఖలలో వివిధ హోదాలలో పనిచేసిన జగ్జీవన్‌రామ్ ఆ పదవులకు వన్నె తెచ్చారన్నారు. అయితే దురదృష్టవశాత్తూ జగ్జీవన్‌రామ్ చరిత్రను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎస్సీ ఎస్టీ వర్గీకరణ విషయానికి వస్తే ఆ ఫలాలు భావితరాలు అనుభవించాలన్నారు. అప్పుడే విజయోత్సవాలకు అనుకూలమైన సమయంగా చెప్పారు. ప్రతి బిడ్డను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఇప్పటికీ వర్గీకరణపై కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆరుగురు న్యాయూర్తులు వర్గీకరణను సమర్థిస్తూ తీర్పునిచ్చారని అయితే ఆ బృందంలో వర్గీకరణను వ్యతిరేకించిన న్యాయమూర్తి సైతం ఇటీవల వర్గీకరణను సమర్థించడం మాదిగల విజయంగా చెప్పవచ్చన్నారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు పన్నినా, వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ వారికి భంగపాటు తప్పలేదని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును ఆ పోరాటంలో అమరులైన వారికి అంకితం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీజీ కూచిపూడి బాబురావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇందుపల్లి శ్యామ్యూల్ ఆనంద్, స్టేట్ జీఎస్టీ ప్రిన్సిపాల్ కమిషనర్ పులిపాక ఆనంద్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిటైర్డ్ డీఐజీ చావలి బాలస్వామి, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేఆర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ గల వ్యక్తి గుదిబండి

● సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి



మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లిపర, అక్టోబరు 6: నిజాయితీ గల వ్యక్తి గుదిబండి వెంకటరెడ్డి అని సొసైటీ అధ్యక్షుడు ఆరిమండ కృష్ణారెడ్డి నివాళి అర్పించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే గుదిబండి వెంకటరెడ్డి 8వ వర్థంతిని మండల కేంద్రం కొల్లిపరలో ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయనేతలు గుదిబండి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకే నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు వరుసగా విజయం సాధించిన ఘనత వెంకటరెడ్డికే దక్కుతుందన్నారు. మచ్చలేని రాజకీయ నాయకుడు వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, నాయకులు మునగాల సుందరరామయ్య, మునగాల రామలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



నందివెలుగులో గజలక్ష్మీదేవిగా, కొలకలూరులో మహాలక్ష్మిగా కనకదుర్గాదేవి, కొల్లిపర శ్రీజనార్దనస్వామి ఆలయంలో శ్రీలలితాదేవిగా అమ్మవారు

అమ్మవారికి విశేష పూజలు



లలితా త్రిపుర సుందరిదేవిగా పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు



పొన్నూరు రామాలయంలో లలితా త్రిపుర సుందరి దేవిగా, గాయత్రీ దేవిగా వాసవి కన్యకా పరమేశ్వరి

తెనాలి రూరల్, అక్టోబరు 6: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారు గజలక్ష్మీ అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని నందివెలుగులో చరిత్రప్రసిద్ధిచెందిన అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో కనకదుర్గమ్మకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మండలంలోని కొలకలూరులో రజక సంఘీయుల ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర షిరిడీ సాయిబాబా మందిరంలో గాయత్రిదేవి, గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి వారి దేవస్థానంలో లలితాదేవి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాయత్రిదేవి, శ్రీదేవి, భూదేవి జనార్ధనస్వామి ఆలయంలో శ్రీలలితాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, హనుమాన్‌పాలెం, తూములూరు, చివలూరు, అత్తోట శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

● పొన్నూరు టౌన్: తెలగపాలెం కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి దుర్గాదేవి లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు పంచముఖ గాయత్రీ దేవిగా దర్శనం ఇచ్చింది. భావనారాయణస్వామి ఆలయ ఉపాలయంలోని కాశీవిశాలాక్షమ్మ లలితా త్రిపుర సుందరీదేవిగా అభయమిచ్చింది. పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులోని కనకదుర్గా భవానీ అమ్మవారు అన్నపూర్ణదేవిగా అలకంరించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్నారు. శ్రీకనకదుర్గా భవానీ ఆలయం, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

● చేబ్రోలు: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా మండల పరిధిలోని శలపాడులో కొలువుతీరిన దుర్గాదేవి శాకాంబరి మాతగా భక్తుల పూజలు అందుకుంది. శ్రీదుర్గా భవానీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపంలో కొలువుతీరిన అమ్మవారిని శాకాంబరి మాతగా వివిధ రకాల కూరగాయలలు. ఫలాలతో అలంకరించారు. శాకాంబరి మాతను దర్శించుకునేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

లలితా త్రిపుర సుందరి దేవిగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని, అక్టోబరు 6: పెదకాకాని మల్లన్న సన్నిధిలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దేవీ శరన్నవ్రత ఉత్సవాల్లో భాగంగా పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయాన్ని నిత్యం వేలాదిమంది భక్తుల దర్శించి ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. ప్రజలు దసరా ఉత్సవాలలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.

అసాంఘిక శక్తులకు పొన్నూరులో చోటు లేదు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 6: అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారికి పొన్నూరు నియోజకవర్గంలో చోటులేదని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హెచ్చరించారు. ఆదివారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో పోలీస్ శాఖపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రేషన్ మాఫియా అరికట్టాలని అధికారులకు సూచించారు. పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం మాఫియా చేసి అక్రమ రవాణా ద్వారా అక్రమార్జనకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నేరగాళ్ల కదలికలను గుర్తించేందుకు కృషి చేద్దామన్నారు. కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి స్వచ్ఛంద సంస్థల సహకారం కోరుతామన్నారు. పొన్నూరులో జూదం సింగిల్ నెంబర్ ఆటలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై మద్యం సేవించి ప్రయాణికులు, పాదచారులను ఇబ్బంది పెట్టేవారిని వదిలిపెట్టవద్దని ఆదేశించారు. ఈవ్‌టీజింగ్, ఆడపిల్లలు మహిళల పట్ల అమానుషంగా, అసభ్యకరంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దన్నారు. గంజాయి మత్తులో యువత చిత్తవుతోందని గంజాయి విక్రయాలు, రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేబ్రోలులో బాలిక హత్య కేసులో నిందితుడు నాగరాజు ఆచూకీని కనిపెట్టి త్వరగా అరెస్టు చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రహదారి మరమ్మతు పనులు చేస్తున్న పొక్లయిన్

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం

పొన్నూరు టౌన్, అక్టోబరు 6: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో నిడుబ్రోలు రోడ్డు, భవనాల శాఖకు చెందిన రహదారి మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నిడుబ్రోలు నుంచి పట్టణ శివారు వరకు ఆర్ అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల రహదారిపై ప్రయాణించలేక పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారి పూర్తిగా ధ్వంసం కావటంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాలతో రూ.20 లక్షల వ్యయంతో అధికారులు రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు. రహదారి మరమ్మతు పనులు ప్రారంభం కావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రక్షిత తాగునీరు సరఫరా చేస్తాం: కమిషనర్

పొన్నూరు టౌన్, అక్టోబరు 6: పురపాలక సంఘంలోని ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని నిడుబ్రోలు 11వ వార్డులో పబ్లిక్ ట్యాప్ నుంచి రంగుమారిన నీరు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ రమేష్‌బాబు డీఈఈ ఏడుకొండలు వార్డులో పర్యటించి రంగుమారి వచ్చిన నీటిని పరిశీలించారు. కుళాయిలను తనిఖీచేసారు. పలు ప్రాంతాలలో పరీక్షలు నిర్వహించి మరమ్మతులు చేసి ప్రజలు సురక్షిత నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

మద్యం షాపు లైసెన్స్‌లకు ఎన్ని దరఖాస్తులైనా ఇవ్వొచ్చు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఏవీ చలం

తెనాలి క్రైం, అక్టోబరు 6: ప్రభుత్వం మద్యం షాపులపై తీసుకువచ్చిన నూతన పాలసీ ప్రకారం ఒకే వ్యక్తి ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం ఉందని తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎ.వెంకటచలం ఆదివారం తెలిపారు. తెనాలి స్టేషన్ పరిధిలో 25 మద్యం షాపులను అనుమతులు ఉన్నాయి. తెనాలి టౌన్‌లో 11 షాపులు, తెనాలి రూరల్ 5, దుగ్గిరాల మండలంలో 5, కొల్లిపర మండలంలో 4 షాపులకు ఉన్నాయి. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తు రుసుం రూ.2లక్షలు, అది నాన్ రిఫండబుల్ అని సీఐ తెలిపారు. దరఖాస్తుల రుసుములను డీడీ రూపంలో తమ ఆఫీసులో ఇవ్వవచ్చు లేదా నెట్ బ్యాంక్, చలనా రూపంలో గాని, నెట్ సెంటర్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ నెల 11న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పారదర్శకంగా జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయడం జరుగుందన్నారు. లైసెన్స్ గడువు సెప్టెంబరు 26 వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

మాలల హక్కుల పరిరక్షణకు ఉద్యమం

పొన్నూరు టౌన్, అక్టోబరు 6: మాలల హక్కుల పరిరక్షణకు గ్రామ స్థాయి ఉద్యమాన్ని చేపడతామని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య తెలిపారు. ఆదివారం పట్టణంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన చైతన్య మాట్లాడుతూ మాలలను నిర్లక్ష్యంచేసే ప్రభుత్వాలపై తగు రీతిలో బుద్ధి చెబుతామన్నారు. మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుర్రం రామారావు మాట్లాడుతూ వర్గీకరణ తీర్పుపై ఇంకా తలుపులు మూసుకుపోలేదన్నారు త్వరలోనే క్యూరేటివ్ పిటిషన్ దాఖలుచేసి తమ హక్కులను కాపాడుకోనున్నట్లు చెప్పారు. వర్గీకరణపై గ్రామ స్థాయి ఉద్యమాన్ని ఏర్పాటు చేయనునట్లు చెప్పారు. సమావేశంలో కంచర్ల చిట్టిబాబు, కాగిత కోటేశ్వరరావు, కారుమంచి సునీల్, బొనిగల ప్రదీప్, దగ్గుమళ్ల శ్రీకర్, కర్ర ప్రతాప్, జంగా రాజేష్, యడ్ల వందనం తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 10న యాదవ రాజుల కార్తీక వన సమారాధన

తెనాలి, మారీసుపేట అక్టోబరు 6: చంద్రవంశ క్షత్రియ యాదవ రాజుల 13వ కార్తీక వన సమారాధన నవంబరు 10వ తేదీన జరుగుతుందని యాదవ సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని హోటల్ బృందావనంలో ఆదివారం చంద్రవంశ క్షత్రియ యాదవ రాజుల 13వ కార్తీక వన సమారాధన పోస్టర్‌ను యాదవ సంక్షేమ సంఘ సభ్యులు డాక్టర్ తాడిబోయిన అవినాష్, న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి, సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘీయులు వేలాదిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యాదవ ఉద్యోగ, ఉపాధ్యాయ సభ్యులు, సంఘ సభ్యులు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, రైయిన్‌బో స్కూల్ చైర్మన్ దొడ్డక ఆదినారాయణ, తాడిబోయిన బుచ్చిరాజు, తాడిబోయిన లక్ష్మీనారాయణ, దర్శి శంకర్, కరేటి లక్ష్మీనారాయణ, తాడిబోయిన వసంతరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం.. భయాందోళనలో ప్రజలు

కొల్లిపర, అక్టోబరు 6: మండలంలోని గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు రోడ్లపైకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరించడంతో గ్రామాల ప్రజలు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కకాటుతో హాస్పటల్ పాలవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా సిరిపురం, దావులూరిపాలెం, కొల్లిపర, తూములూరు, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో కుక్కల తాకిడి ఎక్కువైంది. పంచాయతీ కార్యదర్శులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. మండల కేంద్రం కొల్లిపరలో శ్రీ వీరభద్రస్వామికాలనీ, కొత్తబొమ్మువానిపాలెం వెళ్లే రోడ్డులో కుక్కలు గుంపులు, గుంపులుగా చేరి వాహనచోదకులపై దాడి చేస్తున్నాయి. వాహనచోదకులు ఆ రహదారుల్లో ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.